సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 22 । ఆగస్టు । 2024



9 మంది ఎర్రస్మగ్లర్ల అరెస్టు

భాకరాపేట బీటులోని మర్రిమాను శిల అటవీ ప్రాంతంలో 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని, 9 మంది స్మగ్లర్‌లను అటవీ అధికారులు అరెస్టు చేశారు. -8లో



టీడీపీలో కోల్డ్‌వార్!

టీడీపీలో కోల్డ్‌వార్ తారాస్థాయికి చేరింది. అదికూడా చిన్నస్థాయి నాయకుల మధ్య కాదు...ఎమ్మెల్యే, ఇన్‌చార్జుల మధ్యే జరగడం కడపలో హాట్‌టాపిక్‌గా మారింది. -8లో

గరిష్టం/కనిష్టం
39.2/29.9

వాతావరణం

జిల్లాలో బుధవారం 29.9 – 39.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

బాలాజీ పట్టాలెక్కేనా!



తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ప్రతిపాదనకు రైల్వే శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇస్తుందా.. ఉమ్మడి వైఎస్సార్, చిత్తూరు జిల్లా వాసుల దశాబ్దాల కల నెరవేరుతుందా.. ఎంపీలందరూ ఉమ్మడిగా కృషి చేస్తే.. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కలిసి వస్తే 'బాలాజీ'పట్టాలెక్కిన ట్లేనంటున్నారు రైల్వే నిపుణులు. తాజాగా విశాఖ జోన్ ఏర్పాటుతో బాలాజీ డివిజన్‌పై ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలో సాక్షి ప్రత్యేక కథనం.

- విశాఖజోన్ ఏర్పాటుతో సర్వత్రా చర్చ
- బాలాజీ డివిజన్ ప్రతిపాదనపై ఆశలు
- జిల్లాకు దూరాభారమైన గుంతకల్
- సెప్టెంబరు 4న రైల్వేశాఖతో ఎంపీల సమావేశం



తిరుపతి రైల్వేకేంద్రం

రాజంపేట: తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ప్రతిపాదనకు రైల్వే అధికారులు పచ్చజెండా ఎప్పుడూపుతారోనని ఉమ్మడి వైఎస్సార్, చిత్తూరు జిల్లా వాసులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. డివిజన్ కేంద్రంగా తిరుపతిని చేస్తే కాట్పాడి నుంచి గుంతకల్, నెల్లూరులో గూడూరు, వైఎస్సార్, అన్నమయ్య జిల్లా పరిధిలో 700 కిలోమీటర్ల దూరం వస్తుంది. 400 కిలోమీటర్ల ఉంటే డివిజన్‌గా ప్రకటించవచ్చునని రైల్వే నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తాజాగా విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ప్రకటించిన నేపథ్యంలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అదే సమయంలో తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్‌ను ఏర్పాటుచేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. తూర్పుకోస్తా పరిధిలోని వాల్తేరు డివిజన్‌లో కొంతభాగం విశాఖ రైల్వేజోన్‌లో కలపడం కన్నా, తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్‌గా చేయాలని సీమ వాసుల నుంచి కేంద్రానికి వినతులు వెళ్తున్నాయి. పైగా బాలాజీ డివిజన్ చేయాలని ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదన ఉంది.

గుంతకల్‌కు వెళ్లాలంటే దూరాభారం....

ప్రస్తుతం డివిజన్ కేంద్రంగా గుంతకల్ ఉంది. దీంతో తరుచూ సమావేశాలకు గుంతకల్ డివిజన్ కేంద్రానికి వెళ్లి రావాలంటే అధికారులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతకల్, గుంటూరు, విజయవాడ డివిజన్లతోపాటు కొత్తగా బాలాజీ డివిజన్ ఏర్పాటుచేసి విశాఖజోన్‌లో కలిపితే బాగుంటుందని రైల్వే నిపుణులు అంటున్నారు. ఆ దిశగా ఎంపీలు రైల్వేమంత్రిత్వశాఖపై ఒత్తిడి తీసుకురావాలని సీమవాసులు కోరుతున్నారు.

కొత్త డివిజన్ ఏర్పడితే నందలూరుకు పూర్వ వైభవం..

కొత్త డివిజన్ ఏర్పడితే బ్రిటిషు కాలం నాటి నందలూరు రైల్వే కేంద్రం పూర్వవైభవం సంతరించుకుంటుంది. బాలాజీ డివిజన్ కేంద్రానికి దగ్గరలో ఉన్న రేణిగుంట జంక్షన్ తర్వాత నందలూరు రైల్వే కేంద్రం రైల్వేపరమైన ప్రాముఖ్యత కలిగి ఉంది. డివిజన్‌కు రైల్వే ప్రత్యామ్నాయ పరిశ్రమను ఏర్పాటుచేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. గతంలో రైల్వేమంత్రి లాలూ ప్రసాద్‌యాదవ్ స్వయంగా రాజ్యసభలో నందలూరులో రైల్వేపరిశ్రమను ఏర్పాటును ప్రకటించిన సంగతి తెలిసిందే. విశాఖ జోన్ ఏర్పడిన నేపథ్యంలో గుంతకల్ డివిజన్ నుంచి వేరుచేసి కడప (ఉభయజిల్లాలు) వరకు బాలాజీ డివిజన్‌గా ఏర్పాటుచేసే ప్రతిపాదన కార్యరూపం దాల్చేందుకు పాలకులు నడుంబిగించాల్సి ఆవశ్యకత ఎంతైనా ఉందంటున్నారు రైల్వేనిపుణులు.

సెప్టెంబరు 4న ఎంపీలతో సమావేశం..

విజయవాడలో సెప్టెంబరు 4న ఎంపీలతో సమావేశం నిర్వహించేందుకు రైల్వే ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు 1వతేదిలోపు ఎంపీల నుంచి ప్రతిపాదనలు, హాల్టింగ్, కొత్తరైళ్లు, కొత్త రైలుమార్గాలు, ప్రయాణికుల సమస్యల తదితర గురించి లేఖలు తీసుకుంటున్నారు. ఉభయవైఎస్సార్, అన్నమయ్య, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎంపీలు బాలాజీ డివిజన్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని బాలాజీ డివిజన్ పరిధిలోకి వచ్చే ప్రాంతీయులు కోరుతున్నారు. ప్రత్యేకంగా రైల్వేమంత్రిత్వశాఖ ఏర్పాటుచేయనున్న సమావేశంలో ఎంపీలు బాలాజీ డివిజన్‌పై గళం విప్పాలని, ఇదే మంచి సమయమని రైల్వేనిపుణులు అంటున్నారు. విశాఖ జోన్ ఏర్పాటు నేపథ్యంలో బాలాజీ డివిజన్ ఏర్పాటు ఆవశ్యకత ఎంతైనా ఉంది. మరి కూటమి పాలకులు ఈ విషయాన్ని ఎంత బాధ్యతగా తీసుకుంటారో చూడాలి.

▸▸ బాలాజీ డివిజన్ ఏర్పాటైతే..



బాలాజీ డివిజన్ ఏర్పాటైతే ఇందులో తిరుపతి–గూడూరు (92.96కిమీ), తిరుపతి–కాట్పాడి (104.39కిమీ),పాకాల–మదనపల్లె (83కిమీ), రేణిగుంట–కడప (125కిమీ)లైను కలిపే అంశాన్ని గతంలోనే రైల్వే అధికారులు పరిశీలించారు. నంద్యాల–పెండేకల్లు (102కిమీ)లైను గుంటూరు డివిజన్‌లోకి విలీనం చేయాలని పరిశీలించారు. కాగా జిల్లా మీదుగా వెలుగొండ అడవుల్లో నుంచి వెళ్లే కృష్ణపట్నం రైల్వేలైన్ కూడా విజయవాడ డివిజన్‌లోకి వెళ్లింది.

బాలాజీ డివిజన్ ఏర్పాటు అవసరం



బాలాజీ డివిజన్ ఏర్పాటు ఎంతైనా అవసరం. విశాఖ జోన్ ఏర్పడుతున్న క్రమంలో కొత్త డివిజన్లను ఏర్పాటు చేయాల్సి వస్తే అది ముందుగా బాలాజీ డివిజన్ ఉంటుందని భావిస్తున్నాను. డివిజన్ కావడానికి అన్ని అర్హతలు బాలాజీ డివిజన్‌కు ఉన్నాయని రైల్వే నిపుణులు భావన. డివిజన్ ఏర్పాటు కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. ఇది అందరికీ ఉపయోగకరం. కేంద్ర రైల్వేమంత్రిత్వశాఖ ఆ దిశగా అడుగులు వేయాలని డిమాండ్ చేస్తున్నా.


-పీవీ మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

ఇది దశాబ్దాల కాలం నుంచి ఉండే ప్రతిపాదన



గుంతకల్ డివిజన్ నుంచి వేరుకాబడి బాలాజీ డివిజన్ ఏర్పాటైతే నందలూరుకు మళ్లీ పూర్వవైభవం సంతరించుకున్నట్లే. రైల్వేపరిశ్రమ పెట్టేందుకు మార్గం సుగమమవుతుంది. బాలాజీ డివిజన్‌లో రేణిగుంట తర్వాత ప్రాముఖ్యత కలిగిన రైల్వేకేంద్రం నందలూరు. అంతేగాకుండా గుంతకల్‌కు వెళ్లాలంటే దూరాభారం. తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్ అనుకూలం. ఈ డివిజన్ ప్రతిపాదన దశాబ్దాల కాలం నాటిది. విశాఖజోన్ ప్రకటనతో బాలాజీ డివిజన్ ప్రతిపాదనపై ఆశలు రేకెత్తాయి.

-మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా రవీంద్రనాథ్‌రెడ్డి



పి.రవీంద్రనాథ్‌రెడ్డి



అమర్‌నాథ్‌రెడ్డి



రామగోవిందరెడ్డిని అభినందిస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ నేతలు

- అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి
- జిల్లా జెడ్పీ ఛైర్మన్ అభ్యర్థిగా బ్రహ్మంగారి మఠం జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి
- వైఎస్సార్ ఉమ్మడి జిల్లా పార్టీ నాయకుల సమావేశంలో నిర్ణయం

కడప కార్పొరేషన్: వైఎస్సార్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి నియమితులయ్యారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు చెందిన పార్టీ నాయకులతో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల పార్టీ అధ్యక్షుడిగా ఎవరిని నియమించాలన్నదానిపై ఆయన వారితో చర్చలు జరిపి ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతోపాటు రాబోయే వైఎస్సార్ జిల్లా జెడ్పీ ఛైర్మన్ అభ్యర్థిత్వంపైనా వారి అభిప్రాయాలు తీసుకున్నారు. పార్టీ సూచనల మేరకు వైఎస్సార్ జిల్లా జెడ్పీ ఛైర్మన్ అభ్యర్థిగా బ్రహ్మంగారి మఠం జెడ్పీటీసీ రామగోవిందరెడ్డిని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.

క్రీడా ప్రతిభ అవార్డులకు ఐదు పాఠశాలలు ఎంపిక

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో 2023–24 సంవత్సరానికి వివిధ పాఠశాలల నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో పాల్గొన్న క్రీడాకారులకు వచ్చిన పాయింట్ల ఆధారంగా క్రీడా ప్రతిభ అవార్డులు ప్రకటించారు. ఈ అవార్డులకు జిల్లావ్యాప్తంగా 8 ఉన్నత పాఠశాలలు దరఖాస్తు చేసుకోగా ఐదింటిని ఎంపిక చేశారు. బుధవారం జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి అరుణకుమారి ఆధ్వర్యంలో జిలానీబాషా, శంకర్‌రెడ్డి, ప్రవీణ్‌కిరణ్, వసంత్‌లు కలిసి క్రీడా ప్రతిభ అవార్డుల ఎంపికకు సంబంధించి జాబితాను పరిశీలించి డీఈఓ మర్రెడ్డి అనురాధకు అందజేశారు. డీఈఓ సంబంధిత జాబితాను ప్రకటించారు. ప్రథమ స్థానంలో కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్(1040 పాయింట్లు), ద్వితీయ స్థానంలో పొద్దుటూరు డీబీసీఎస్ మున్సిపల్ హైస్కూల్(174 పాయింట్లు), తృతీయస్థానం మైదుకూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల(172 పాయింట్లు), నాలుగో స్థానం చెన్నూరు మండలం రామనపల్లె జెడ్పీ హైస్కూల్(146 పాయింట్లు), ఐదోస్థానం ఎర్రగుంట్ల జెడ్పీ హైస్కూల్(137 పాయింట్లు) నిలిచాయి.

గ్రామసభలను విజయవంతం చేయాలి

కలెక్టర్ శివశంకర్ లోతేటి




మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న గ్రామసభలను జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో విజయవంతం చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలు నుంచి ఈ నెల 23న రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామపంచాయతీల్లో ప్రారంభించనున్న గ్రామసభల సంసిద్ధతపై కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్ని మండలాల క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 23న జరిగే గ్రామసభలలో ఆయా మండల ప్రత్యేక అధికారులు గ్రామ సదస్సులో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి పనుల గుర్తింపు – ప్రణాళికా ప్రక్రియను రూపొందించుకునేందుకు సర్పంచ్ అధ్యక్షతన ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభలను నిర్వహించాలన్నారు. అక్టోబర్ 2 నుండి ప్రారంభం కానున్న నూతన గృహ నిర్మాణాల్లో ప్రతి ఇంటికి ఖచ్చితంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. డ్వామా పీడీ విజయ్ కుమార్, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ అయిషాన్ బాషా, ఏఈ ఏడుకొండలు, పశు సంవర్ధక శాఖ జేడీ శారదమ్మ పాల్గొన్నారు.

లాభాపేక్ష లేకుండా ఇసుక సరఫరా!

ఎటువంటి లాభాపేక్ష లేకుండా వినియోగదారులకు డిపోల ద్వారా ఇసుకను సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో జేసీ అదితిసింగ్‌తో కలిసి కలెక్టర్ మైన్స్, ఇరిగేషన్, రవాణాశాఖ అధికారులతో జిల్లాలో ఇసుక సరఫరా విధానం అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. ఎలాంటి కొరత లేకుండా సులభతరంగా ఇసుక రవాణా జరిగేందుకు సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు.

కలిసిరాని ఖరీఫ్!



- కరుణించని వరుడుడు... కష్టాల్లో కర్షకుడు
- ఈ ఏడాది ఖరీఫ్ సాగు లక్ష్యం ప్రశ్నార్థకం
- ఆశలన్నీ కేసీ కెనాల్‌పైనే



కమలాపురం ప్రాంతంలో ఎండుముఖం పట్టిన మినుము

కడప అగ్రికల్చర్: ఈ ఏడాది ఖరీఫ్ రైతులకు కాలం కలిసి రాలేదు. వారి ఆశలు అడియాసలుగానే మిగిలేలా కనిపిస్తున్నాయి. ఖరీఫ్ ప్రారంభంలోనే వర్షాలు బాగా కురవడంతో చాలా మంది రైతులు ఉత్సాహంగా సాగును ప్రారంభించారు. ఇందులో భాగంగా చాలా మంది రైతులు ఆరుతడి పంటలను సాగు చేశారు. రోజులు గడిచేకొద్దీ వరుణుడు ముఖం చాటేయడంతో సాగు చేసిన ఆరుతడి పంటలు ఎండుముఖం పట్టాయి. జిల్లాలో సుమారు 5 వేల ఎకరాలకుపైగా మినుము పంట ఎండిపోయింది. పత్తి, కంది, వేరుశనగ అక్కడక్కడ ఎండుముఖం పట్టాయి. దీంతో చేసేదేమీ కొంత మంది రైతులు మినుము పంటలను దున్నేయగా మరి కొంత మంది రైతులు అలాగే పొలంపైనే వదిలేశారు.

సకాలంలో ఈ క్రాపు కాక..

అసలే గోరుచుట్టూ.. ఆపై సమ్మెట పోటు అన్నట్లుగా తయారైంది రైతుల పరిస్థితి. వేలకు వేలు ఖర్చు చేసి సాగు చేసిన పంటలు కళ్లముందే ఎండిపోయాయి. పంట పరిహారం వస్తుందంటే ఈ క్రాపు నమోదు సకాలంలో చేపట్టలేదు. దీంతో ఇటు వర్షం లేక ...అటు ఈ క్రాపు నమోదు చేసుకోలేక చాలా మంది రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. వర్షాభావంతో పంటలు దున్నేసిన రైతులకు ప్రభుత్వం కనీసం సబ్సిడీతో విత్తనాలనైనా అందించి ఆదుకుంటుందంటే ఆ ఊసే లేకుండా పోయిందని చాలా మంది మినుము రైతులు ఆవేదనను వ్యక్తం చేశారు. మొత్తంపై ఈ ఏడాది ఖరీఫ్ రైతులకు కలిసిరాకపోగా నష్టాన్ని మిగిల్చింది. ఈ ఏడాది ఖరీఫ్ సాగు లక్ష్యం నెరవేరడం కష్టతరంగా మారింది. కాకపోతే కేసీ కెనాల్‌కు నీరు విడుదల కావడంతో వరిసాగు విస్తీర్ణం కొంత పెరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు కూడా సాగు లక్ష్యం కేసీ కెనాల్‌పైనే ఆధారపడి ఉన్నారు.

కష్టమంతా నేలపాలు..

జిల్లావ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మినుముపంట సాధారణసాగు 2642 హెక్టార్లుకాగా ముందస్తు వర్షంలో 4207 హెక్టార్లలో సాగయింది. సాగు తరువాత వరణుడు ముఖం చాటేయడంతో జిల్లాలోని కమలాపురం, ఎర్రగుంట్ల, వల్లూరు, వీఎన్ పల్లి, కొండాపురం, మైలవరంలతోపాటు పలు మండలాల్లో 5 వేల ఎకరాలకుపైగా మినుముపంటను రైతులు దున్నేశారు.

50 శాతం మించి సాగుకాని ఇతర పంటలు...

జిల్లాలో మినుము, మొక్కజొన్న మినహా ఏ పంటలు కూడా 50 శాతం మించి సాగు కాలేదు. ఇందుకు కారణం సరైన వర్షం లేకపోడమే. జిల్లాలో అన్ని పంటల పరిస్థితి ఇదే.


ఆశలనీ కేసీ కెనాల్‌పైనే..

ఖరీఫ్‌పై తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగుపై అటు అధికారులు ఇటు రైతులు ఆశలన్నీ కెనాల్‌పైనే పెట్టుకున్నారు. కేసీ కెనాల్ ఆయకట్టు జిల్లాలో 92 వేల ఎకరాలకుపైగానే ఉంది. కేసీ కాలువకు నీరు వస్తుండటంతో చాలామంది రైతులు వరి పంటను అధిక విస్తీర్ణంలో సాగుచేయనున్నారు. దీంతోపాటు కేసీ కాలువ నీరు వస్తున్న నేపథ్యంలో కేసీ పరిధిలో భూగర్భజలాలు కొంత మేర అభివృద్ధ చెంది బోర్ల కింద కూడా సాగు విస్తీర్ణం పెరగనుంది. కాకపోతే ప్రస్తుతం వేసవి తరహాలో ఎండలు కాస్తున్నాయి. ఈ ఎండలకు భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏదిఏమైనా ఖరీఫ్ సాగు లక్ష్యం కేసీ కెనాల్ నీటిపైనే అధారపడి ఉంది.

జిల్లాలో సాధారణ, ప్రస్తుత సాగు వివరాలు హెక్టార్లలో..

పంట	సాధారణ సాగు	ప్రస్తుత సాగు
వరి	31,171	6614
సజ్జ	1039	506
కంది	3894	1702
గ్రీన్‌గ్రామ	250	70
వేరుశగన	5971	2658
సన్‌ఫ్లవర్	1126	125
ఆముదం	821	257
సోయాబీన్	963	262
పత్తి	24086	7126
చెరకు	94	18
మొత్తం	75189	25,523

ఒక్క రూపాయి నష్ట పరిహారం అందలే...



నా పేరు వెదరూరు నాగేశ్వర రెడ్డి. మాది కమలాపురం మండలం కంచన్నగారిపల్లె. నేను ఎకరాకు రూ. 10 వేలు పెట్టి 5 ఎకరాల్లో మినుము పంటను సాగు చేశాను. వర్షాభావ పరిస్థితుల్లో నేను నా 5 ఎకరాల మినుముపంటను దుక్కేశాను. ఈ 5 ఎకరాల మినుముకోసం రూ. 50 వేలకు పైగా ఖర్చు చేశాను. ప్రభుత్వం నాకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

– నాగేశ్వరరెడ్డి, కంచన్నగారిపల్లె

ఆశలన్నీ కేసీపైనే...



ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలోనే వర్షాలు బాగా కురవడంతో సాగు బాగా అయింది. ఆ తరువాత వర్షాలు లేక సాగు కొంత మందగించింది. కాకపోతే ఈ ఏడాది ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు శ్రీశైలం డ్యాం నిండింది. దీంతో ప్రభుత్వం కేసీ కాలువకు నీటిని విడుదల చేసింది. ఈ నేపథ్యంలో చాలా మంది రైతులు కేసీ పరిధిలో పంటలను సాగు చేయనున్నారు. ఏదిఏమైనా సెప్టెంబర్ చివరి నాటికి సాగు లక్ష్యాన్ని చేరే ఆశలు అవకాశం ఉంది.

– అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి

కడప అగాడీలో విద్యుత్ తీగ తగిలి మృతిచెందిన విద్యార్థి ఖురేషి తంజువుర్ రహిమాన్



ఈ ప్రాణం ఖరీదెంత?

మధ్యాహ్నం ఒంటిగంట సమయం..
బడి గంట కొట్టగానే వడివడిగా
బయటికొచ్చారా దోస్తులు..
రోజులాగే ఒకే సైకిల్‌పై
ఇళ్లకు బయలుదేరారు..
చక్రాలు జోరుగా
ముందుకు కదిలాయి..
కాళ్లు చేతులూ ఆడిస్తున్నారు..
ఎప్పట్లాగే ఏంచక్కా
ముచ్చట్లాడుతున్నారు..
నవ్వుతూ.. తూలుతూ
ముందుకు సాగుతున్నారు...

ఒక్క క్షణం.. ఒకే ఒక్క క్షణం..
తలో దిక్కు పడ్డారు..
అందాక ఆడిన ఆ కాళ్లూ చేతులు
కదలకుండా పడి ఉన్నాయి..
మాటలు మూగబోయాయి..
నవ్వులు ఎప్పుడో
మాయమయ్యాయి..
ఉన్నట్లుండి చిన్నారుల శరీరంపై
మంటలు..

ఏమైంది..
ఏమవుతుంది....
ఆ పాత కథే..
ప్రజా భద్రత ప్రశ్నార్థకంగా మారి..
తీగలా అల్లుకుపోయిన
నిర్లక్ష్యపు కథే...

అధికారుల అలసత్వం అనాలా..
ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం అనాలా..
ఎవరినంటేనేం.. ఏమంటేనేం..
వందేళ్లు బతకాల్సిన
ఓ నిండు ప్రాణం
మొగ్గలోనే నేల రాలింది...
'ఊపిరి' పోసుకునేందుకు
మరో ప్రాణం తల్లడిల్లుతోంది....

ఈ పాపం ఎవరిది...?
ఈ శిక్ష ఎవరికి..?
రోడ్లపై గుంతలా పూడ్చరు..
మురుగు కాలువ వైపు
అస్సలు తొంగి చూడరు..
గజిబిజిగా కరెంటు వైర్లు..
గందరగోళంగా కనెక్షన్లు..
పని పనికో ఖరీదు కడతారు...
ప్రతి సర్వీసుకో బేరమాడతారు!

ఈ నిండు ప్రాణం ఖరీదెంత?
ఆ కుటుంబం
జీవితాంతం పడే వేదనంత!
పిల్లాడొస్తాడని గుమ్మం కాడే
నిలబడి చూసే తల్లి
ఎదురుచూపులంత!

ఈ నిర్లక్ష్యం వెల ఎంత?
పోయిన ప్రాణాన్ని
తిరిగి తీసుకురాలేనంత..
జీవించే హక్కును కాలరాసేంత...

నిన్న మురుగు కాలువ..
నేడు కరెంటు తీగ..
పిల్లల పాలిట
మృత్యు పాశాలవుతున్నాయ్..
తల్లిదండ్రుల జీవితానికి సరిపడా
చేదు జ్ఞాపకాలు మిగిలిస్తున్నాయ్..

కాటేసిన కరెంటు తీగ -8లో

క్లుప్తంగా

సీబీఆర్‌కు కృష్ణాజలాలు

లింగాల : పార్నపల్లి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(సీబీఆర్)కు బుధవారం గండికోట ప్రాజెక్టు నుంచి 5 ఎత్తిపోతల పథకాల ద్వారా కృష్ణాజలాలు చేరాయి. రోజుకు 400 క్యూసెక్కుల చొప్పున సీబీఆర్‌కు నీటిని విడుదల చేస్తున్నామని ఈఈ రాజశేఖర్ తెలిపారు. త్వరలో లింగాల కుడికాలువకు తాగు, సాగు నీటిని విడుదల చేస్తామని ఆయన పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని కాల్వకట్ట వీధిలో లోకేష్‌కుమార్ (21) అనే యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. లోకేష్‌కుమార్ బేల్దారి పని చేసుకొని జీవనం సాగించేవాడు. అప్పుడప్పుడు అతనికి మూర్ఛ వస్తుంటుంది. మంగళవారం రాత్రి మూర్ఛ రాగా కొద్ది సేపటి తర్వాత తగ్గిపోయింది. ఈ క్రమంలో కొంత సేపు పడుకుంటానని ఇంట్లోకి వెళ్లాడు. చాలా సమయం గడిచినా బయటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్ల చూడగా చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ సీఐ గోవిందరెడ్డి తెలిపారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుల అరెస్టు



నిందితుడు, మద్యం బాటిళ్లతో పోలీసులు

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండలం తెలికి, బిదినంచెర్ల గ్రామాల్లో బెల్టు షాపు నిర్వహిస్తున్న నిర్వాహకులు ఇద్దరిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 68బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తులసి నాగప్రసాద్ తెలిపారు. అలాగే అంకాలమ్మ గూడూరులో జూదమాడుతున్నారని సమాచారం రావడంతో ఎస్సై తులసి నాగప్రసాద్ సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు జూదరులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.6140 స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో ఏఎస్సై ఖాదర్‌వలి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ : ఇద్దరు యువకులు మృతి



మృతులు తరుణ్‌కుమార్‌రెడ్డి, సాయికుమార్‌రెడ్డి

పోరుమామిళ్ల : పట్టణ శివారులోని మల్లకతువ మలుపులో బుధవారం సాయంత్రం కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. కలసపాడు మండలం ఎగువ రామాపురానికి చెందిన తరుణ్‌కుమార్‌రెడ్డి (20), సాయికుమార్‌రెడ్డి (17) సొంత పనుల నిమిత్తం పోరుమామిళ్లకు బైక్‌లో వచ్చారు. తిరిగి వెళుతుండగా ప్రమాదం జరిగింది.తీవ్రగాయపడిని ఇద్దరిని కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

ఏటీఎంలలో రూ.13.21 లక్షలు మాయం

– కేసు నమోదు చేసిన పోలీసులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని పలు ఏటీఎంలలో రూ.13.21 లక్షల నగదు మాయమైనట్లు సంబంధిత ఏజెన్సీ సిబ్బంది గుర్తించారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధి మహేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. బద్వేలు, కలసపాడు, పోరుమామిళ్ల ప్రాంతాల్లోని పలు బ్యాంకుల ఏటీఎంలలో సీఎంఎస్ సంస్థ నగదు జమ చేస్తోంది. సదరు సంస్థ నియమించిన సిబ్బంది ప్రతిరోజూ బ్యాంకులోకి వెళ్లి నగదు డ్రా చేసుకుని ఏటీఎంలలో జమ చేస్తుంటారు. ఈ క్రమంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న రెండు ఎస్‌బీఐ ఏటీఎంలు, గుంతపల్లె క్రాస్‌రోడ్డులోని ఓ ఎస్‌బీఐ ఏటీఎంలలో జమ చేసిన నగదుకు సంబంధించి మంగళవారం నిర్వహించిన ఆడిట్‌లో రూ.13.21 లక్షలు నగదు తేడా వచ్చినట్లు గుర్తించారు. సిబ్బంది నగదును జమ చేయకుండా దారి మళ్లించినట్లుగా గుర్తించారు. ఈ మేరకు నగదు జమ చేసే ఇద్దరు సిబ్బందిపై అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాటేసిన కరెంట్ తీగ

- కరెంట్ వైర్లు తగిలి విద్యార్థి దుర్మరణం
- మరో విద్యార్థికి తీవ్రగాయాలు
- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణం



ఖురేషి తంజువుర్ రహిమాన్ మృతదేహం



తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న అద్నాన్



సంఘటన స్థలం



కడపలోని హోలిస్టిక్ ఆసుపత్రి వద్ద జనం

కడప అర్బన్ : తెలిసీ తెలియని వయసు పిల్లలు ఇద్దరు చెట్టాపట్టాలు వేసుకుని సైకిల్‌లో మధ్యాహ్నం తాము చదువుతున్న పాఠశాల నుంచి ఇంటికి బయలు దేరారు. విద్యుత్ సరఫరా ఉన్న కరెంట్ లైన్‌కున్న తీగ వేలాడుతూ వీరికి చుట్టుకుంది. అంతే తమకు తెలియకుండానే ప్రమాదానికి గురయ్యారు. శరీరంపై యమపాశంలా విద్యుత్ తీగ పడుతుందని భావించలేకపోయారు. మంటలు చెలరేగాయి. వీరిద్దరి శరీరాలపై విద్యుత్ తీగ పడిన ప్రదేశమంతా కాలిపోయాయి. ఆ సమయంలో అదే వీధిగుండా ద్విచక్రవాహనంలో వస్తున్న వ్యక్తి వెంటనే ఈ దృశ్యాన్ని చూసి వెంటనే మరో వ్యక్తితో కలిసి కట్టెతో విద్యుత్ తీగను వేరు చేశారు. స్థానిక ప్రజల సహకారంతో ఇద్దరు పిల్లలను కడప నగరంలోని క్రిస్టియన్‌లైన్‌లో ఉన్న హోలిస్టిక్ హాస్పిటల్‌లో చికిత్స కోసం తరలించారు. సంఘటన స్థలాన్ని, ఆసుపత్రిని కడప టూటౌన్ సీఐ బి. నాగార్జున, ఎస్ఐ ఎస్‌కెఎం హుసేన్ తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు.

క్షణాల్లో సంఘటన ..

క్షణాలలోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో బెల్లంమండివీధిలో నివాసం ఉంటున్న అబ్దుల్ రహిమాన్ పెద్దకుమారుడు ఖురేషి తంజువుర్ రహిమాన్ (11) హాస్పిటల్‌కు తీసుకొచ్చిన కొంతసేపటికి మృతి చెందాడు. మరోబాలుడు ఆటోడ్రైవర్ అజ్మత్‌ఆలీ చిన్నకుమారుడు షేక్ అద్నాన్ (11) తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు. వీరిద్దరు సైకిల్‌పై ప్రతి రోజూ తమ ఇంటి నుంచి బయలుదేరి రోడ్డుకు అవతలవైపు ఇంటర్నేషనల్ కల్యాణమండపం సమీపంలో ఉన్న విద్యాసాగర్ స్కూల్‌లో ఐదోతరగతి చదువుతున్నారు. బుధవారం కూడా సైకిల్‌పై తమ స్కూల్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో టైటానిక్ బిల్డింగ్ లైన్‌లో విద్యుత్ తీగ వేలాడుతూ ఉండటం గమనించలేకపోయారు. విద్యుత్ తీగ తగలడంతోనే సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు కుప్పకూలిపడిపోవడం, మంటలన్నీ వ్యాపించడం క్షణాల్లో జరిగిపోయాయి. విద్యుత్ అధికారుల, సిబ్బంది నిర్లక్ష్యమే ఈ విషాద ఘటనకు కారణమని స్పష్టంగా తెలుస్తోంది.

విద్యుత్ ప్రమాదం సంఘటనపై జిల్లా విద్యాశాఖాధికారి మర్రెడ్డి అనురాధ విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాద సంఘటన వివరాలను కడపలోని హోలిస్టిక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి అద్నాన్ తండ్రి అజ్మత్ ఆలీని, కుటుంబ సభ్యులను అడిగి వివరాలను తెలుసుకున్నారు.

నా కుమారుడిని బ్రతికించండి సార్ : అద్నాన్ తండ్రి



నా కుమారుడు అద్నాన్, తన స్నేహితుడు రహిమాన్‌తో కలిసి ఐదోతరగతి చదువుతున్నాడు. ఇద్దరు కలిసి మెలిసి సైకిల్‌లో స్కూల్‌కు వెళ్లి వచ్చేవారు. అలాంటిది కరెంట్ తీగ తగిలి రహిమాన్ చనిపోవడం, తన కుమారుడు తీవ్రంగా గాయపడటం బాధాకరం. నా కుమారుడిని ఎలాగైనా బ్రతికించండి అంటూ వైద్యులను వేడుకుంటున్నాడు.

స్పెషల్ డ్రైవ్ ద్వారా విద్యుత్ ప్రమాదాలను నివారిస్తాం - ఎమ్మెల్యే మాధవి



కడప నగరంలో ఇష్టానుసారంగా రోడ్లకు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ స్తంభాలతోపాటు, ఇతర సంస్థలకు సంబంధించిన వైర్లు కూడా చుట్టి ఉన్నాయనీ తమ పరిశీలనలో తేలింది. స్పెషల్ డ్రైవ్ ద్వారా అడ్డదిడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లను, విద్యుత్ స్థంభాలను విద్యుత్ అధికారుల ద్వారా తొలగింపచేస్తాం. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం. విద్యార్థి మృతికి వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం. ప్రభుత్వం వారి కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు తమ వంతుగా కృషి చేస్తామన్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే విద్యార్థి మృతి



మాట్లాడుతున్న కార్పొరేటర్లు పాకా సురేష్ కుమార్, బాలస్వామిరెడ్డి

కడప కార్పొరేషన్ : విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే ఇంటర్నేషనల్ కళ్యాణ మండపం వద్ద విద్యుత్ వైర్లు తెగిపోయి ఒక విద్యార్థి చనిపోయాడని, మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డారని కార్పొరేటర్లు పాకా సురేష్ కుమార్, ఎం. బాలస్వామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కరెంటు తీగలు కిందకి వేలాడుతున్నా విద్యుత్ శాఖ సిబ్బంది పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కలెక్టర్ చొరవ తీసుకొని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన విద్యార్థి కుటుంబానికి రూ.20లక్షలు, గాయపడిన విద్యార్థి కుటుంబానికి రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డి వరకుమార్ పాల్గొన్నారు.

టీడీపీలో కోల్డ్‌వార్!

- వరదనీటి కాలువ పనులు ముందుకా... వెనక్కా
- బిల్టప్ వద్దనున్న స్థలాన్ని సర్వే చేస్తారా...ఆపేస్తారా



కాలువ పనులను పరిశీలిస్తున్న కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ నేత శ్రీనివాసులరెడ్డి(ఫైల్)

కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీలో కోల్డ్‌వార్ తారాస్థాయికి చేరింది. అదికూడా చిన్నస్థాయి నాయకుల మధ్య కాదు...నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జుల మధ్యే జరగడం కడపలో హాట్‌టాపిక్‌గా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కడప, కమలాపురం ఇన్‌చార్జుల మధ్య ఏ విషయంలోనూ పొసగని పరిస్థితి తలెత్తినట్లు సమాచారం. కడపలో ఖరీదైన భూ సెటిల్‌మెంట్లలో కమలాపురం నేత జోక్యం చేసుకుంటుండటంతో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది. దీనికితోడు డీఎస్పీ, ఆర్డీఓల నియామకంలోనూ ఇద్దరి మధ్య సయోధ్య కుదరనట్లు తెలిసింది. ఇదిలా ఉండగా మొన్న బిల్టప్ సర్కిల్ వద్దనున్న కమలాపురం నేత స్థలం వద్దకు అధికారులను తోడ్కొని వెళ్లి కాలువ పనులను పరిశీలించడం అగ్నికి ఆజ్యం పోసింది. చౌటపల్లె రోడ్డు నుంచి ఎస్‌బీఐ కాలనీ మీదుగా బిల్టప్ సర్కిల్‌లో ఉన్న సబ్‌స్టేషన్ వరకు వరదనీటి కాలువ నిర్మించాలని రూ. 4కోట్లలో టెండర్లు పిలిచారు. పనులు కూడా దాదాపు పూర్తయ్యాయి. ఎస్‌బీఐ కాలనీ మెయిన్ రోడ్డు వద్దకు వచ్చేసరికి పనులు ఆగిపోయాయి. అది ప్రభుత్వ స్థలమే కదా.. కాలువ నిర్మిద్దామని గత కమిషనర్ భావించినప్పటికీ కమలాపురం నేత అభ్యంతరం చెప్పినట్లు సమాచారం. రోడ్డు డివైడర్ వరకు స్థలం తనదేనని, పట్టా స్థలమైనందున నష్ట పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు ఆరంభించాలని చెప్పినట్లు తెలిసింది. బిల్టప్ ప్రక్కన కోనేరు ఉండేదని, దాన్ని కమలాపురం నేత తన స్థలంలో కలిపేసుకున్నారని స్థానికుల ఆరోపణలు ఉన్న ఈ నేపథ్యంలో సోమవారం కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డి, టీడీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి అధికారులతో వెళ్లి కాలువ పనులను పరిశీలించారు. స్థలానికి సంబంధించిన విలేజ్ మ్యాప్, స్కెచ్ తీసుకు రావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.కమలాపురానికి చెందిన టీడీపీ నేత స్థలం ప్రక్కనే ఉందని తెలిసి కూడా వారు అక్కడికి వెళ్లడం వారి మధ్య ఉన్న విభేధాలను బహిర్గత పరుస్తోంది. ఇది రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులను సంకట స్థితిలోకి నెట్టింది. విడవమంటే పాముకు కోపం, కరవమంటే కప్పకు కోపం అన్నచందంగా ...అధికారులు ఏం చెప్పినా మరొకరు వారిపై విరుచుకుపడే ప్రమాదమున్నందున వారు ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా రాజకీయ రంగు పులుముకున్న ఈ వరదనీటి కాలువ పనులు ముందుకు సాగుతాయా...అక్కడితో ఆగిపోతాయా అన్నది తేలడానికి మరికొంతకాలం వేచిచూడాలి.

వ్యక్తిపై కేసు నమోదు

కొండాపురం : మండల పరిధిలోని దత్తాపురం ఎస్సీ కాలనీలో బొమ్మేపల్లె నారాయణమ్మను అ దే కాలనికి చెందిన వి.గంగులయ్య దూషించాడని, దీంతో కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశవరెడ్డి బుధవారం తెలిపా రు. ఎస్ఐ వివరాల మేరకు బి.నారాయణమ్మ ప్ర వర్తన సరిగా లేదని మందలించి చెప్పుతో కొట్టా డు. ఈమేరకు ఫిర్యాదు అందడంతో కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బీరం సుబ్బారెడ్డి



నియామక పత్రానిలందుకుంటున్న భీరం సుబ్బారెడ్డి

ఖాజీపేట : వైఎస్సార్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షునిగా భీరం విద్యా సంస్థల అధినేత అయిన భీరం సుబ్బారెడ్డిని నియమించారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి చేతుల మీదుగా నియామక పత్రాన్ని ఆయన తీసుకున్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. అవినీతి రహిత పాలన బీజేపీ తోనే సాధ్యమన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశం పురోగతి చెందుతోందని అన్నారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శశిభూషన్ తోపాటు పార్టీ నాయకులు ఉన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- కారును ఢీకొన్న లారీ
- ముగ్గురి దుర్మరణం



మృతి చెందిన ప్రతాప్‌రెడ్డి, ప్రమీల, వెంకటలక్ష్మి (ఫైల్)



కారులోనే ఇరుక్కుపోయిన భార్యాభర్తలు

తాడిపత్రి రూరల్ : ఎంతో ఆనందంగా ఉన్న సమయంలో చిన్నపాటి గొడవ జరగడంతో వారు అర్ధంతరంగా వెనుదిరగాల్సి వచ్చింది. ఊహించని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. తాడిపత్రి మండలం వంగనూరు గ్రామ సమీపంలో బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వివరాలు.. యల్లనూరు మండలం గొడ్డుమర్రికి చెందిన ప్రతాప్ రెడ్డి (24), ప్రమీల (20) దంపతులు. ప్రతాప్‌రెడ్డి కారు డ్రైవర్ కాగా, పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో ప్రమీల పనిచేసేది. ప్రేమ వివాహం చేసుకున్న వీరు తాడిపత్రి మండలంలోని గద్దరగుట్టపల్లి కాపురముండేవారు. మంగళవారం వైఎస్సార్ జిల్లా పులివెందుల సమీపంలోని వేంపల్లిలో ప్రమీల సోదరుడి కుమారుడు కేశఖండన ఉత్సవానికి భార్య, ఆమె తల్లి వెంకటలక్ష్మితో కలిసి ప్రతాప్ రెడ్డి కారులో వెళ్లాడు. మంగళవారం రాత్రి కారు రివర్స్ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తికి బురద చిట్లడంతో ప్రతాప్‌రెడ్డితో గొడవకు దిగాడు. వివాదం ఎక్కువవుతుందన్న భయంతో బంధువులంతా ప్రతాప్‌రెడ్డితో పాటు భార్య ప్రమీల, అత్త వెంకటలక్ష్మిని బలవంతంగా కారు ఎక్కి పంపించేశారు. మరో అర గంటలో గద్దరగుట్టపల్లికి చేరుతారన్న సమయంలో వంగనూరు సమీపంలో వీరు ప్రయాణిస్తున్న కారును ఎదురుగా లారీ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రగాయాలైన ప్రతాప్ రెడ్డి, భార్య ప్రమీల ఘటనాస్థలిలోనే ప్రాణాలు విడిచారు. వెంకటలక్ష్మిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కన్నుమూశారు.

భార్య ఫిర్యాదు మేరకు ఆర్టీపీపీ జేపీఏపై కేసు

ఎర్రగుంట్ల : ఆర్టీపీపీలో జూనియర్ ప్లాంట్ అసిస్టెంట్ (జేపీఏ) గా పనిచేస్తున్న వై అంకన్నపై తన భార్య భానుప్రియాంక వేధిపులుకు గురి చేస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కలమల్ల ఎస్ఐ తిమోతి బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు ఆర్టీపీపీలో వై అంకన్న జేపీఏగా పని చేస్తూ క్వార్టర్స్ ఎఫ్-87లో నివాసం ఉంటున్నాడు. భాను ప్రియాంక తన భర్త అంకన్న మానసికంగా, శారీరకంగా వేధింపులు గురి చేస్తున్నారని ఈ నెల 19వ తేదీన కలమల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు.విచారణ జరిపి జేపీఏ అంకన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైజాగ్ టూ ప్రొద్దుటూరు..

- జల్సాలకు అలవాటు పడి గంజాయి వ్యాపారం
- గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులు అరెస్ట్
- 4 కిలోల గంజాయి, రెండు బైక్‌లు స్వాధీనం




నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో డీఎస్పీ, పోలీసు అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : వాళ్లందరూ చదువుకున్న యువకులే.. జల్సాలకు అలవాటు పడిన వారికి కష్టపడకుండా, సులభంగా డబ్బు ఎలా సంపాదించాలనే ఆలోచన మెదిలింది. అప్పటికే వీరిలో ఒక యువకుడు గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు తెలుసుకొని మిగతా ముగ్గురు కూడా అదే వ్యాపారం చేయడానికి పూనుకున్నారు. అయితే జల్సారాయుళ్ల ఆటలు ఎంతో కాలం సాగలేదు. గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ వివరాలను ప్రొద్దుటూరు డీఎస్పీ భక్తవత్సలం బుధవారం మీడియాకు వెల్లడించారు. ఎర్రగుంట్లలోని రాణివనం వీధికి చెందిన షేక్ అహమ్మద్ పాలిటెక్నిక్ చదువుతూ మధ్యలో మానేశాడు. కొన్ని నెలల నుంచి కారు డ్రైవర్‌గా వెళ్తున్నాడు. డ్రైవింగ్‌లో వచ్చే డబ్బుతో అతను సంతృప్తి చెందలేదు. ఎలాగైనా ఎక్కువ డబ్బు సంపాదించాలన్న ఆశ అతనికి కలిగింది. గంజాయి విక్రయిస్తే ఎక్కువగా లాభాలు వస్తాయని భావించాడు. ఎర్రగుంట్లకు చెందిన బోల్లురు నిఖిల్ అలియాస్ బన్నీ అనే యువకుడు వైజాగ్‌లో చదువుకుంటున్నాడు. నిఖిల్‌కు వైజాగ్‌కు చెందిన కిరణ్ అనే యువకుడు పరిచయమయ్యాడు. వీళ్లిద్దరి ద్వారా అహమ్మద్ గంజాయి తెప్పించుకునేవాడు. వైజాగ్ నుంచి తక్కువ ధరకు గంజాయి తెప్పించుకొని పొట్లాల రూపంలో విక్రయించి ఎక్కువ మొత్తంలో లాభాలు గడించేవాడు.

అహమ్మద్‌కు మరో ముగ్గురు తోడయ్యారు..గంజాయి వ్యాపారం చేస్తున్న అహమ్మద్‌కు మరో ముగ్గురు తోడయ్యారు. తాను చేస్తున్న గంజాయి వ్యాపారం గురించి అహమ్మద్ తన అన్న అజ్మతుల్లాతో పాటు అతని స్నేహితులైన వేణు, సలీంలకు చెప్పాడు. దీంతో వాళ్లు కూడా గంజాయి వ్యాపారంలో దిగారు. పూతరేకుల పార్సిల్ అని చెప్పి వైజాగ్ నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ ద్వారా ప్రొద్దుటూరుకు పంపించేవారు. పార్సిళ్లు రాగానే నలుగురు కలిసి గంజాయిని పొట్లాలుగా చుట్టుకొని ఎర్రగుంట్లలో విక్రయించేవారు. ఈ క్రమంలో ట్రావెల్స్‌లో వచ్చిన పార్సిళ్లను కొవ్వూరు గ్యారేజి సమీపంలోని ఖాళీ స్థలంలో బుధవారం నలుగురు పంచుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో టూ టౌన్ సీఐ యుగంధర్, ఎస్ఐలు సిబ్బంతో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో షేక్ అహమ్మద్, మంజులవేణు, షేక్ అజ్మతుల్లా, నాదీండ్ల సలీమ్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నాలుగు కిలోల గంజాయితో పాటు రూ. 33 వేలు నగదు, నాలుగు సెల్ ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో మంచి ప్రతిభ కనబరిచిన సీఐ యుగంధర్, ఎస్ఐ ధనుంజయుడు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

9 మంది ఎర్రస్మగ్లర్ల అరెస్టు

20 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనం, ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్లతో కడప అటవీ అధికార సిబ్బంది

సిద్దవటం : కడప రేంజ్ సిద్దవటం మండలం భాకరాపేట బీటులోని మర్రిమాను శిల అటవీ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని, 9 మంది తమిళనాడుకు చెందిన స్మగ్లర్‌లను అరెస్టు చేశామని కడప రేంజర్ ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు కడప రేంజిలోని భాకరాపేట బీటు పరిసర ప్రాంతాల్లో మంగళవారం సిబ్బందితో విధులు నిర్వహిస్తుండగా ఎవరో మాట్లాడుకుంటున్న శబ్దాలు వినిపించాయన్నారు. మర్రిమానుశిల అటవీ ప్రాంతంలోకి వెళుతుండగా కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేసేందుకు ఫోర్డు ఎండోవర్ వాహనంలో లోడు చేస్తున్నారు. తమ సిబ్బందిని చూసి పారిపోయే ప్రయత్నం చేస్తుండగా వారిని చుట్టుముట్టి వారిపై దాడులు జరిపి అదుపులోకి తీసుకున్నారమన్నారు. అక్కడ లభ్యమైన 20 ఎర్రచందనం దుంగలను, ఫోర్డు ఎండోవర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన వారిలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన దేవరాజు పళనిస్వామి, ములకాడు గ్రామం, ధర్మపురి జిల్లా, సుబ్రమణి పళనియప్పన్, వెల్లివల్లాలు గ్రామం, సితిరి ధర్మవం జిల్లా , వెంకటరత్నమణిచిన్న వెల్లంపల్లి గ్రామం, సితిరి ధర్మవరం జిల్లా, బాక్యిరాజ్ గోవిందన్ వెల్లంపల్లి, రామచంద్రన్ వెల్లంపల్లి, అన్నామలై వెల్లంపల్లి, చంద్రకులన్ కున్నూర్ గ్రామం, జయరామన్ పొన్నన్ వెల్లంపల్లె, పెరుమాల్ దాసంగ్‌గుందార్, సేలం జిల్లాలకు చెందిన వారు ఉన్నారు. వీరందరిని కోర్టులో హాజరు పరిచామని ప్రసాద్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగల బరువు 484కిలోలు ఉండగా, వీటి ధర రూ. 2.26 లక్షలు చేస్తాయన రేంజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాకరాపేట ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, బీటు ఆఫీసర్ గంగాధర్, ఎఫ్‌బీఓలు రాజశేఖర్‌రాజు, క్రిష్ణ ప్రసాద్, పార్వతి, ఏబీఓలు కిషోర్‌కుమార్, షాహినా బాను, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.